సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ


శనివారం । 25 । నవంబర్ । 2023



28 నుంచి సమ్మేటివ్-1

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసేందుకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ) పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) తాజాగా ప్రకటించింది.

10లో




జలవిహారం.. జగదానందకరం

క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా అన్నవరం దివ్యక్షేత్రంలో.. పంపా సరోవరంలో.. సత్యదేవుని హంస వాహన విహారం పరమానందకరంగా జరిగింది.

10లో

డెల్టాలకు 6 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శుక్రవారం 6 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

విద్యాభివృద్ధితోనే సమాజ పురోగతి



భవిత కేంద్రంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న మంత్రి వేణు

కాజులూరు: విద్యాభివృద్ధితోనే సమాజం పురోగతి సాధిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. అందుకే పేద వర్గాలకు సైతం నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాలు రూపొందిస్తున్నారని చెప్పారు. కాజులూరు భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సమగ్ర శిక్షా విభాగం ఆధ్వర్యాన పాఠ్య ప్రణాళిక యాప్‌లతో ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమాజ ప్రగతిలో విద్య, ఆరోగ్యం ఎంతో కీలకమని, అందువల్లనే ఈ రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చి, కేటాయింపులు చేస్తోందని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు - నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, ఆంగ్ల మాధ్యమంలో బోధన, బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ విద్యారంగంలో సమూల మార్పులు తీసుకువచ్చాయని వివరించారు. దివ్యాంగ విద్యార్థుల్లో నిబిడీకృతమైన ప్రజ్ఞాపాటవాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని, సాధారణ విద్యార్థులతో పాటు సమాన స్థాయిలో అభివృద్ధి చేయాలని మంత్రి వేణు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, ఎంపీపీ మాత భారతి, ఎంఈఓ జాన్, భవిత కేంద్రం ఐఈఆర్‌పీ ఎం.జయప్రకాశ్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల విభాగం అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు తదితరులు పాల్గొన్నారు.

12 రోజుల్లో 26 సాధారణ ప్రసవాలు

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఎన్‌పీఎం స్టాఫ్ నర్సుల కృషి



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న ఎన్‌పీఎం స్టాఫ్ నర్సులు

అమలాపురం టౌన్: గర్భిణులతో వ్యాయామాలు చేయిస్తూ వారికి సాధారణ ప్రసవమయ్యే దిశగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఇటీవల నియమితులైన ఐదుగురు నర్స్ ప్రాక్టీషనర్ ఇన్ మిడ్ వైఫరీ (ఎన్‌పీఎం) స్టాఫ్ నర్సులు కసరత్తు చేస్తున్నారు. గత 12 రోజుల్లో వీరు 26 సాధారణ ప్రసవాలు జరిగేలా చేశారని ఆస్పత్రి సూరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు తెలిపారు. మరో 17 మంది గర్భిణులకు కూడా సాధారణ ప్రసవాలు జరిగేలా వ్యాయామ చిట్కాలతో ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఆ నర్సులతో ఆస్పత్రిలో శుక్రవారం ఓరియెంటేషన్ శిక్షణ జరిగింది. గర్భిణులతో చేయించిన వ్యాయామ విధానాలు, తాము చేసిన సాధారణ ప్రసవాలను ఆ నర్సులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు. ఈ సందర్భంగా సూరింటెండెంట్ డాక్టర్ శంకరరావు మాట్లాడుతూ, యూనిసెఫ్, ఫెర్నాండెజ్ సంస్థల సహకారంతో భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఐదుగురు నర్సులను ఆస్పత్రి లేబర్ రూములో నియమించామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 60 మందిని ప్రభుత్వం ఎంపిక చేసి, గుంటూరు, తిరుపతి నగరాల్లో బీఎస్సీ నర్సింగ్‌లో 18 నెలల పాటు శిక్షణ ఇచ్చిందని తెలిపారు. ఆరోగ్య విద్య, బర్త్ పొజిషన్ వ్యాయామాలపై వీరు సుశిక్షితులయ్యారని అన్నారు. దేశంలోనే ఈ వినూత్న కార్యక్రమం ప్రారంభించిన మొదటి రాష్ట్రం మనదేనని చెప్పారు. ప్రసవానంతరం కూడా బాలింతలు వ్యాయామాలు చేసేలా ఈ స్టాఫ్ నర్సులు శిక్షణ ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి గైనకాలజిస్టులు, నర్సింగ్ సూపరింటెండెంట్, హెడ్ నర్సులు, లేబర్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

30న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 30వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరగనున్నాయి. జెడ్పీ సమావేశ మందిరంలో వీటిని నిర్వహించనున్నామని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రులు, ఎంపీలు, శాసన మండలి, శాసనసభ సభ్యులు, జెడ్పీటీసీలు, ఇతర ఆహ్వానితులు హాజరయ్యే ఈ సమావేశాల్లో జిల్లాలో వివిధ ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాల అమలు ప్రగతిని సమీక్షిస్తారన్నారు. జిల్లా అధికారులు శాఖాపరమైన సమగ్ర సమాచారంతో తప్పక హాజరు కావాలని సీఈఓ కోరారు.

రబీకి రెడీ

- సాగుకు సర్వం సిద్ధం
- 1 నుంచి మొదలుకానున్న సీజన్
- జిల్లాలో వరి సాగు అంచనా 1.94 లక్షల ఎకరాలు
- అవసరమైన విత్తనాలు 34,814 క్వింటాళ్లు
- 21,606 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం



సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టాలో రబీ సాగుకు సన్నాహాలు మొదలయ్యాయి. రబీ వరి ఆయకట్టు జిల్లాలోని తూర్పు డెల్టా కొంత వరకూ, మధ్య డెల్టాలో పూర్తిగా ఉంది. ఆత్రేయపురం, కపిలేశ్వరపురం మండలాల్లో పంపింగ్ స్కీముల దిగువన మరికొంత ఉంది. మిగిలినదంతా గోదావరి పంట కాలువల కిందనే సాగవుతోంది. అధికారికంగా వచ్చే నెల 1 నుంచి జిల్లాలో రబీ షెడ్యూలు ఆరంభం కానున్నది. ఈ ఏడాది గోదావరి నీటి లభ్యత తక్కువగా ఉన్నందున రైతులు ముందస్తు సాగు చేపట్టాలని ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లాల నీటి పారుదల సలహా మండళ్ల (ఐఏబీ) సమావేశాల్లో నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకు అనుగుణంగా రైతులకు సాగుపరమైన ఇబ్బందులు రాకుండా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్నారు.

ముందస్తు సాగుకు తగినట్టుగా..

- గోదావరిలో నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని రబీలో ముందస్తు సాగు చేపట్టేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహించారు. వ్యవసాయ అధికారులు, రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డిసెంబర్ నెలాఖరుకు నాట్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, స్వల్పకాలిక రకాలు సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అవగాహన కల్పించారు.
- సాగుకు అవసరమైన ఎరువులు, పురుగు మందులను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. జిల్లావ్యాప్తంగా 1.97 లక్షల ఎకరాలలో రబీ వరి సాగు జరుగుతూండగా, మొక్కజొన్న 3,400, పప్పు ధాన్యాలు 7,177, నూనె గింజలు 167 ఎకరాల్లో సాగవుతాయని అంచనా. వరి సాగుకు 34,814 క్వింటాళ్ల అవసరం కాగా, దీనిలో రాయితీపై 3 వేల క్వింటాళ్లు అందించనున్నారు. ఇప్పటి వరకూ 400 క్వింటాళ్ల ఎంటీయూ-1121 వరి విత్తనాలను రాయితీపై ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచారు.
- రబీ సాగు సమయంలో వివిధ రకాల ఎరువులు 62,956 మెట్రిక్ టన్నులు అవసరమని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. దీనిలో ఇప్పటి వరకూ 22 వేల టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచారు. ఆర్‌బీకేలలో 2,300 టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నాయి. జనవరి మొదటి వారంలో తొలి దఫా ఎరువులు వేసే అవకాశమున్నందున వచ్చే నెలాఖరు నాటికి రెండో దఫా ఎరువులను అందుబాటులోకి తీసుకురానున్నారు.

బొండాలు (ఎంటీయూ-3626)

డెల్టా రైతులు అధికంగా రబీలో బొండాల రకం (ఎంటీయూ-3626) సాగు చేస్తూంటారు. అధిక దిగుబడులు రావడంతో పాటు అప్పుడప్పుడు జాక్‌పాట్‌లా తగిలే ధర ఈ రకాన్ని అధికంగా సాగు చేసేలా రైతులను పురిగొల్పుతోంది. సగటు దిగుబడి 55 బస్తాల (బస్తా 75 కేజీలు, 41.25 క్వింటాళ్లు) వరకూ ఉంటుందని అంచనా. గత ఏడాది వరి ధాన్యం సాధారణ రకం కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,040 వరకూ ఉండగా, బొండాల రకానికి ఏకంగా రూ.2,400 నుంచి రూ.2,500 వరకూ వచ్చింది. అయితే ప్రభుత్వం నుంచి కొనుగోలు అనుమతి లేకపోవడంతో రైతులు తక్కువగా సాగు చేశారు. దిగుబడి పెరగడానికి తోడు, ధర రావడంతో ఈ ఏడాది పెద్ద ఎత్తున సాగు చేసే అవకాశముంది. దీనిని గుర్తించిన జిల్లా యంత్రాంగం ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించింది. ఈ రకం కొనుగోలుకు ఎటువంటి హామీ ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ రకం బియ్యం కొనుగోలుపై కేరళ నుంచి ఆర్డర్లు సక్రమంగా రాకపోవడంతో జిల్లా యంత్రాంగం అనుమతి ఇవ్వలేకపోతోంది.

వచ్చే నెలాఖరుకు నాట్లు పూర్తి చేయాలి



రబీ వరి సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధం చేశాము. వీటిని ఇప్పటికే ఆర్‌బీకేల వద్ద అందుబాటులో ఉంచాం. డిసెంబర్ నెలాఖరు నాటికి మరో దఫా ఎరువులను రైతులకు అందుబాటులోకి తీసుకువస్తాం. రైతులు స్వల్పకాలిక రకాలు సాగు చేయడం, డిసెంబర్ నెలాఖరుకు నాట్లు పూర్తి చేయడం ద్వారా నీటి ఎద్దడి బారిన పడకుండా సహకరించాలి.

– వి.బోసుబాబు, జిల్లా వ్యవసాయ అధికారి

అనుచిత వ్యాఖ్యలు తగవు

- ఎమ్మెల్యే పొన్నాడపై మాజీ మంత్రి మల్లాడి మాట్లాడిన తీరు దారుణం
- వైఎస్సార్ సీపీ నాయకుల మండిపాటు



కోరంగిలో మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు వ్యాఖ్యలను ఖండిస్తున్న తాళ్లరేవు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

తాళ్లరేవు: ప్రపంచ మత్స్యకార దినోత్సవ సభలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌పై యానానికి చెందిన మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ తాళ్లరేవు మండల నాయకులు ఖండించారు. కోరంగిలోని పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవింద కుమార్ నివాసంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం పార్టీ నాయకులు సమావేశమయ్యారు. వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, నాయకులు కాశి లక్ష్మణస్వామి, రేవు మల్లీశ్వరి, రెడ్డి రెడ్డిబాబు, దున్నా శ్రీకాంత్, సర్పంచ్‌లు పెయ్యల మంగేష్, వెంటపల్లి నూకరాజు, ఎంపీటీసీ సభ్యులు పోతుల రత్నకుమారి, బళ్ల సంధ్యారాణి తదితరులు మాట్లాడారు. తనకు శిష్యుడిగా భావించే పొన్నాడపై మల్లాడి అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. తమ నాయకుడు పొన్నాడ కోరంగిలో నిర్వహించిన ప్రపంచ మత్స్యకార దినోత్సవ సభకు వేలాదిగా అభిమానులు తరలివచ్చి విజయవంతమైందని గుర్తు చేశారు. అదే సమయంలో యానాంలో మల్లాడి ఏర్పాటు చేసిన మత్స్యకార దినోత్సవ సభకు ప్రజాదరణ కొరవడిందని, ఇది తట్టుకోలేక అసహనానికి గురై పొన్నాడపై వ్యాఖ్యలు చేయడం సరికాదని నాయకులు అన్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని చెబుతూనే, మరోవైపు ఆయన పార్టీ ఎమ్మెల్యేలను పేరు పెట్టి మరీ కాకినాడ సిటీ, ముమ్మిడివరంలో ఓడిస్తానని శపథం చేయడం, ఎక్కడో ఉన్న నర్సాపురంలో జనసేన అభ్యర్థిని గెలిపిస్తానని అనడం ఆయన రాజకీయ అనుభవానికి తగదని అన్నారు. యానాంలో 35 వేల మంది ఓటర్లుంటే, ముమ్మిడివరం నియోజకవర్గంలో 2 లక్షలకు పైగా ఉన్నారని, యానాంలో ఒక కులం మద్దతుతో గెలవగలరేమో కానీ, ముమ్మిడివరంలో అన్ని వర్గాల మద్దతూ ఉంటేనే విజయం సాధిస్తామన్న సంగతి గుర్తించాలని వివరించారు. ముఖ్యమంత్రి స్థాయి అభ్యర్థిని యానాంలో నిలబెట్టి ఓటమి పాలు చేసిన మల్లాడి.. ముమ్మిడివరంలో పొన్నాడను ఓడిస్తామని అనడం హాస్యాస్పదమన్నారు. యానాంలో కృష్ణారావు వెంట ఒక వర్గం ఉండవచ్చేమో కానీ.. ముమ్మిడివరంలో ఎస్సీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలు పొన్నాడ వెంట అధిక సంఖ్యలో ఉన్నాయని స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో మల్లాడి ప్రమేయం లేకుండానే పొన్నాడ గెలిచారన్న సంగతి గమనించాలన్నారు. పొన్నాడపై అనుచిత వ్యాఖ్యలు మానకపోతే భవిష్యత్తులో ముమ్మిడివరానికి చెందిన వైఎస్సార్ సీపీ అభిమానులు, అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో దడాల జగదీశ్వరరావు, అద్దంకి లక్ష్మీనారాయణ, కె.చందు, మోకా మధుబాబు, ఆకుల వెంకటేశ్వర్లు, వినకోటి రామకృష్ణ, బొంతు మోహన్, గునిపే విష్ణు, నల్లి శ్రీనివాస్, నీలపాల శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ, మల్లాడి వ్యాఖ్యలపై మండిపడ్డారు.

క్రీడా ప్రాధికార సంస్థ చట్ట సవరణకు అభిప్రాయాలు తెలపాలి

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ చట్ట సవరణపై ప్రజలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు, క్రీడా సంఘాలు, శిక్షకులు, వివిధ శాఖాధిపతులు తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరుతున్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పి.సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హెచ్ఎం ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ఈ చట్టం సవరణకు ఆంధ్రప్రదేశ్ క్రీడల అధికార సంస్థ వీసీ, ఎండీ, ఆరుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా క్రీడా ప్రాధికార సంస్థ వెబ్‌సైట్ ద్వారా అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

సాధికారత సాకారం

- నేడు తుని రాజా కళాశాల మైదానంలో సామాజిక సాధికార బస్సు యాత్ర సభ
- తరలి రానున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు
- మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

తుని: బడుగు బలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేసిన చరిత్ర టీడీపీది. ఇందుకు భిన్నంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను అక్కున చేర్చుకుని, బాసటగా నిలిచిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది. ఆయన అధికారంలోకి రాక మునుపు.. వచ్చాక ఆయా వర్గాలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించారు. మంత్రి పదవులతో పాటు నామినేటెడ్, స్థానిక సంస్థల వరకూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించి అగ్రాసనం వేశారు. తద్వారా అణగారిన వర్గాలకు నిజమైన సామాజిక సాధికారతను అమలు చేసి చూపించారు. రాజకీయ, ఆర్థికంగా ఆ వర్గాలను ఉన్నత స్థాయికి తీసుకువెళ్లారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఆయా వర్గాలు అందుకే బ్రహ్మరథం పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే జగన్ సారథ్యంలో ఈ వర్గాలకు చేకూరిన సామాజిక న్యాయాన్ని వివరించేందుకు వైఎస్సార్ సీపీ రాష్ట్రవ్యాప్తంగా సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తోంది. ఈ యాత్ర శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా తునిలో జరగనుంది. దీనికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. సభకు పెద్ద ఎత్తున బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు తరలి రావడానికి సన్నద్ధమవుతున్నారు.

పార్కింగ్ ప్రదేశాలు

- తుని రూరల్ మండలం నుంచి వచ్చే వాహనాలకు శ్రీచైతన్య, నారాయణ స్కూల్, గణపతి నగర్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు.
- తొండంగి మండలం నుంచి వచ్చే వాహనాలకు తుని వ్యవసాయ మార్కెట్ యార్డు, కోటనందూరు మండలం నుంచి వచ్చే వారికి రాజా కళాశాల మైదానం సూరవరం రోడ్డు, పార్కు రోడ్డు పార్కింగ్‌కు కేటాయించారు.
- తుని పట్టణానికి చెందిన వారు తమ వాహనాలను ఆయా ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.



తుని రాజా కళాశాల మైదానంలో సభ ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రి రాజా, ఎస్పీ సతీష్‌కుమార్

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి దాడిశెట్టి రాజా

తుని రాజా కళాశాల మైదానంలో నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బహిరంగ బస్సు యాత్ర సభా స్థలాన్ని రాష్ట్ర, రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ లతాకుమారి శుక్రవారం పరిశీలించారు. ఈ సభకు 60 వేల మంది వస్తారని, ఇందుకు అనుగుణంగా బందోబస్తు ఏర్పాటు చేయాలని మంత్రి రాజా సూచించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ సతీష్ కుమార్ చెప్పారు.



సామాజిక సాధికార బస్సు యాత్రకు తుని ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం

తునికి తరలి రానున్న అగ్రనేతలు

సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభకు బీసీ, ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వైఎస్సార్ సీపీ అగ్రనాయకులు రానున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీలు నందిగం సురేష్, వంగా గీత, పిల్లి సుభాష్‌చంద్రబోస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, పలువురు ఎమ్మెల్సీలు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు. సభకు ముందు మోటారు సైకిళ్లతో ర్యాలీ నిర్వహించేందుకు పార్టీశ్రేణులు సిద్ధమవుతున్నాయి.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలి

అమలాపురం రూరల్: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని చక్కటి ప్రణాళిక, సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని కేంద్ర ఆర్థిక సంఘం సంచాలకులు శోభిత్ గుప్తా జిల్లా అధికారులను కోరారు. ఈ యాత్ర నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులకు కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి 17 రకాల కేంద్ర ప్రభుత్వ పథకాలపై జిల్లాకు కేటాయించిన మూడు వాహనాల ద్వారా ప్రచార కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని చెప్పారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ, వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర జిల్లాలోని పేరూరులో శుక్రవారం ఆరంభమైందని తెలిపారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, సచివాలయాల వలంటీర్లతో ఈ కార్యక్రమం సమర్థంగా నిర్వహించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి వి.కృష్ణకుమారి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మండలంలో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రకు కేటాయించిన వాహనం పర్యటనపై ముందస్తు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు కె.చంటిబాబు సీహెచ్ఎన్‌వీ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, పశు సంవర్ధక శాఖ జేడీ కె.వెంకట్రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు 10 సూత్రాలు

- రోడ్డు భద్రతకు ప్రాధాన్యం
- అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసు శాఖ యత్నం
- వాహన చోదకుల్లో చైతన్యం తెచ్చేందుకు పోస్టర్‌కు రూపకల్పన
- విస్తృతంగా ప్రచారం

అమలాపురం టౌన్: విధి వక్రించో.. మానవ తప్పిదాల వల్లనో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు శాఖ ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోంది. దీనికోసం జిల్లా ట్రాఫిక్ రికార్డ్స్ బ్యూరో (డీటీఆర్‌బీ) 10 సూత్రాలతో పోస్టర్ రూపొందించింది. రోడ్డు ప్రమాదాలకు ప్రధానంగా గుర్తించిన 10 కారణాలను వివరిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తూ ఈ పోస్టర్ రూపొందించారు. దీనిని గతంలో రోడ్డు ప్రమాదాలకు కారకులైన వాహనచోదకులకు వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల ద్వారా పంపిస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. అలాగే ఈ పోస్టర్‌లోని అంశాలతో భారీ ఫ్లెక్సీ రూపొందించి, ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే కూడళ్లలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వీటి ద్వారా వాహన చోదకుల్లో ముఖ్యంగా యువతలో అవగాహన పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణకు 10 సూచనలతో జిల్లా పోలీసు శాఖ ముద్రించిన పోస్టర్

10 సూత్రాలివీ..

- మలుపు తిరిగేటప్పుడు వాహనాల రాకపోకలను గమనించి వెళ్లండి. విధిగా సిగ్నల్ ఇండికేటర్లు వాడండి.
- ట్రాఫిక్ సిగ్నల్స్ విధిగా అనుసరించాలి.
- మద్యం తాగి వాహనాలు నడపడం మీకే కాదు.. ఎదుటి వారి ప్రాణాలకు కూడా ప్రమాదం.
- 18 సంవత్సరాల్లోపు పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వవద్దు.
- రోడ్డుపై ప్రయాణించేటప్పుడు వాహనానికి వాహనానికి మధ్య కనీసం 50 మీటర్ల దూరం పాటించాలి.
- అతి వేగంగా నడిపే వ్యసనాన్ని వదలాలి.
- ఎదుట వెళ్లే వాహనాన్ని అధిగమించేటప్పుడు మీ వాహనం మీ అధీనంలో ఉండాలి.
- వాహనం నడిపేటప్పుడు పరధ్యానం వద్దు.
- టూ వీలర్లు నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి.
- ఫోర్ వీలర్లు నడిపేవారు సీట్ బెల్ట్ కచ్చితంగా పెట్టుకోవాలి.

ప్రమాదాల నివారణకు మరిన్ని చర్యలు

ఈ సూత్రాలతో విస్తృత ప్రచారం చేస్తూనే రోడ్లపై ముఖ్యంగా జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా కూడళ్ల వద్ద వాహనాల అతి వేగాన్ని నియంత్రించేందుకు పలుచోట్ల బారికేడ్లు లేదా రేడియం స్టిక్కర్లు అతికించిన పీపాలు రోడ్లపై ఉంచుతున్నారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను ప్రత్యేక సర్వే ద్వారా గుర్తించి, అటువంటి చోట్ల కూడా బారికేడ్లు, పీపాలు ఏర్పాటు చేశారు. దీనికి తోడు జాతీయ రహదారుల్లో 'స్టాప్, వాష్ అండ్ గో' విధానం అమలు చేస్తున్నారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు భారీ వాహనాలను రాత్రి వేళల్లో ఆపి, చల్లటి నీళ్లతో డ్రైవర్ల ముఖం కడిగించి అతడి నిద్ర మత్తు వదిలించే ప్రయత్నం చేస్తున్నారు. డ్రైవర్లను కొద్దిసేపు అక్కడే హాల్ట్ అయ్యేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయని, రోడ్డు ప్రమాదాలు కొంత మేర తగ్గుముఖం పట్టాయని జిల్లా పోలీసు శాఖ చెబుతోంది.

అవగాహన, అప్రమత్తతతోనే ప్రమాదాలకు కళ్లెం



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన, ప్రమాదాలు జరగకుండా వాహనచోదకులు ఎవరికి వారు అప్రమత్తంగా ఉంటే రోడ్డు ప్రమాదాలకు కళ్లెం పడుతుంది. మైనర్లకు మోటార్ సైకిళ్లు ఇవ్వడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకరి అతి వేగం, అజాగ్రత్త వల్ల బాధిత కుటుంబాలు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. ట్రాఫిక్ నిబంధనల పరంగా ఈ 10 అంశాలనూ ప్రతి ఒక్కరూ విధిగా పాటిస్తే రోడ్డు ప్రమాదాలు చాలా వరకూ తగ్గుతాయి.

– సుసరాపు శ్రీధర్, జిల్లా ఎస్పీ, అమలాపురం

గత ఏడాదితో పోల్చితే తగ్గిన రోడ్డు ప్రమాదాలు

జనవరి నుంచి అక్టోబర్ నెలాఖరు వరకూ పది నెలల కాలంలో 2022తో పోల్చితే 2023లో రోడ్డు ప్రమాదాల సంఖ్య జిల్లాలో కొంత మేర తగ్గింది. ఆ వివరాలు..

సంవత్సరం	మరణాలకు కారణమైనవి	తీవ్ర గాయాలకు కారణమైనవి	స్వల్ప గాయాలకు కారణమైనవి	మొత్తం ప్రమాదాలు	మృతుల సంఖ్య
2022	163	125	276	564	176
2023 (ఇప్పటి వరకూ)	152	95	289	536	164

క్లుప్తంగా

కారు, ఆటో ఢీ.. ఐదుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

తాళ్లరేవు: కోరంగి పోలీస్ స్టేషన్‌కు సమీపాన జాతీయ రహదారి-216పై శుక్రవారం ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ నుంచి యానాం వైపు వెళుతున్న కారు.. ఎదురుగా ప్రయాణికులతో వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న యానాంకు చెందిన పెస్సింగి జగ్గారావు, ఆటో డ్రైవర్ సంగాడి వెంకట నరసింహస్వామి, కోరంగి ఫార్మసీ కళాశాల విద్యార్థి పోతనపల్లి మోహిత్, తెనాలి కూచిపూడి గ్రామానికి చెందిన దేవరకొండ రాజేష్ గాయాలయ్యాయి. కారు నడుపుతున్న పెద్దబొడ్డు వెంకటాయపాలెం పాఠశాల హెచ్‌ఎం నడింపల్లి వెంకటరాజు కారులో బెలూన్లు తెరచుకోవడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరిని మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మిగిలిన వారి పరిస్థితి నిలకడగా ఉంది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసమైంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. కోరంగి ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28 నుంచి సమ్మేటివ్-1

- 1 – 10 తరగతులకు ఎస్‌సీఈఆర్‌టీ ప్రశ్నపత్రాలు
- మండల కేంద్రాలకు పరీక్ష పేపర్ల సరఫరా పూర్తి

రాయవరం: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మదింపు చేసేందుకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ) పరీక్షల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) తాజాగా ప్రకటించింది. దీని ప్రకారం ఈ నెల 28 నుంచి వచ్చే నెల ఎనిమిదో తేదీ వరకూ 1 నుంచి 10 తరగతుల విద్యార్థులకు ఎస్‌ఏ-1 పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే ఎస్‌సీఈఆర్‌టీ నుంచి ప్రశ్నపత్రాలు సరఫరా చేశారు. ఈసారి టోఫెల్ పరీక్షలకు కూడా ప్రింటెడ్ ప్రశ్నపత్రాలు సరఫరా చేయడం గమనార్హం. 1 నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులకు బైలింగ్విష్ విధానంలో, పదో తరగతి వారికి మీడియం వారీగా ప్రశ్నపత్రాలు అందజేస్తారు. ఎస్‌ఏ-1 పరీక్షలకు విద్యా శాఖ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ప్రశ్నపత్రాలపై ప్రతి జిల్లాకు సీక్రెట్ క్యూఆర్ కోడ్ కేటాయించారు. పేపర్లను ఎవరైనా లీక్ చేసినా, ఏ పాఠశాల నుంచి లీక్ అయినా విషయం క్షణాల్లో బయట పడే అవకాశం ఉండేలా చర్యలు చేపట్టారు.

రెండు ఫార్మేటివ్ పరీక్షలు పూర్తి

ఫార్మేటివ్ అసెస్‌మెంట్-1, 2 పరీక్షలు ఇప్పటికే పూర్తయ్యాయి. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది పరీక్ష పేపర్ల మూల్యాంకనం, పరీక్ష పేపర్లను విద్యార్థులకు ఇచ్చి, వారి తల్లిదండ్రుల సంతకాలు తీసుకునేందుకు, మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు షెడ్యూల్ ఇవ్వడం గమనార్హం. జనవరిలో ఫార్మేటివ్-3, మార్చిలో ఫార్మేటివ్-4, ఏప్రిల్‌లో 1 నుంచి 9 తరగతులకు ఎస్‌ఏ-2, మార్చిలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు.



పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

ఇదీ పరీక్షల టైం టేబుల్

- 1-5 తరగతులకు ఈ నెల 28న తెలుగు, డిసెంబర్ 1న ఇంగ్లిష్, 2న గణితం, 4న పరిసరాల విజ్ఞానం, 5న ఇంగ్లిష్ పార్ట్-బి టోఫెల్ పరీక్ష.
- 6-10 తరగతులకు ఈ నెల 28న తెలుగు, డిసెంబర్ 1న హిందీ, 2న ఇంగ్లిష్, 4న గణితం.
- డిసెంబర్ 5న 6-7 తరగతులకు జనరల్ సైన్స్, 8-10 తరగతులకు పీఎస్.
- డిసెంబర్ 6న 8-10 తరగతులకు బీఎస్, 7న సోషల్ స్టడీస్, 8న ఇంగ్లిష్ పార్ట్-బి టోఫెల్ పరీక్ష.
- 1-5 తరగతులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్షలు.
- 6, 8, 10 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ.. 7, 9 తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయి.
- 1-8 తరగతులకు 80 మార్కులకు, 9, 10 తరగతులకు 100 మార్కులకు ప్రశ్నపత్రం ఇస్తారు.

తొలిసారి టోఫెల్ ప్రింటెడ్ పేపర్లు

ఇంగ్లిష్‌లో విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించేందుకు ప్రభుత్వం టోఫెల్ విద్యను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు టోఫెల్ పరీక్షను ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు పాఠశాలల్లో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించగా, తొలిసారి ప్రింటెడ్ పేపర్లను ఎస్‌సీఈఆర్‌టీ సరఫరా చేసింది. సాధారణ పరీక్షల మాదిరిగానే ఇకపై టోఫెల్ పరీక్షను ప్రింటెడ్ పేపర్లలో విద్యార్థులు రాయనున్నారు.

2.02 లక్షల మంది విద్యార్థులు

ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు ఎస్‌ఏ-1 పరీక్షలు నిర్వహిస్తారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1-5 తరగతుల వరకు 42,014 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 56,313 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, 6-10 తరగతుల వరకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 66,719 మంది, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో 37,480 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. జిల్లా మొత్తం మీద 1,580 ప్రభుత్వ యాజమాన్య, 456 ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో 2,02,532 మంది విద్యార్థులు ఎస్‌ఏ-1 పరీక్షలు రాయనున్నారు.

మండల కేంద్రాలకు పేపర్ల పంపిణీ

జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) ద్వారానే ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో ఎస్‌ఏ-1 పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పరీక్ష పేపర్లను డీసీఈబీ ద్వారా మండల విద్యా కేంద్రాలకు చేరవేశారు. వీటికి సంబంధిత ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు కస్టోడియన్లుగా వ్యవహరిస్తారు. పది పబ్లిక్ పరీక్ష పేపర్ల మాదిరిగానే పరీక్షల తేదీల వారీగా ప్రశ్న పత్రాలను ట్రంకు బాక్సుల్లో భద్రపర్చారు.

షెడ్యూల్ ప్రకారం..



ప్రభుత్వ విద్యా సంస్థలతో పాటు ప్రైవేటు విద్యా సంస్థలు కూడా షెడ్యూల్ ప్రకారం సమ్మేటివ్-1 పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలి. పరీక్ష పేపర్లను కట్టుదిట్టంగా జాగ్రత్తపరచాలి. ఏ రోజు పేపరును అదే రోజు పరీక్షకు గంట ముందు మాత్రమే సీల్ చేసిన బాక్సుల నుంచి బయటకు తీస్తారు. పబ్లిక్ పరీక్షల మాదిరిగానే ఎస్‌ఏ-1 నిర్వహించాలి.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి

మార్గదర్శకాలు పాటించాలి



ఎస్‌ఏ-1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. ప్రశ్నపత్రాల స్టోరేజీ, పంపిణీ, భద్రత, పరీక్షల నిర్వహణ అంశాల్లో పొరపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేశాం. ఎవరైనా పరీక్ష పేపర్లను ముందుగా లీక్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది.

– బీర హనుమంతురావు, డీసీఈబీ కార్యదర్శి

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి



వేద-2023 సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజానగరం: కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్‌ఎన్ రాజు ఇంజినీరింగ్ విద్యార్థులకు సూచించారు. 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ వాక్యూమ్ ఎలక్ట్రానిక్ డివైజెస్ అండ్ అప్లికేషన్స్' అనే అంశంపై స్థానిక గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా వేద-2023 జాతీయ సదస్సు జరుగుతోంది. బెంగళూరు వేద సొసైటీ సహకారంతో జరుగుతున్న ఈ సదస్సులో రాజు శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సదస్సుకు హాజరైన ప్రముఖులు అందించిన విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకుంటూ నైపుణ్యాభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. జేఎన్‌టీయూకే, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు, ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ, వేద సదస్సు ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. దీని ద్వారా పరిశ్రమలకు అవసరమైన పరిజ్ఞానం, నైపుణ్యాలపై అవగాహన కల్పించుకోవచ్చని చెప్పారు. కళాశాల ఎండీ కె.శశికిరణ్‌వర్మ మాట్లాడుతూ, ఈ వేదిక ద్వారా సెమీ కండక్టర్లు, స్వదేశీ తయారీ సంస్థల అభివృద్ధికి ఔత్సాహికులను ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా వేద-2023 సావనీర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్లు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఆర్‌ఎస్ రాజు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.లీలావతి, డాక్టర్ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి, వేద కన్వీనర్ పి.వెంకట్రావు, కో కన్వీనర్ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

జలవిహారం.. జగదానందకరం

- నేత్ర పర్వంగా సత్యదేవుని తెప్పోత్సవం
- పంపా సరోవరంలో హంస వాహనంపై విహరించిన స్వామి, అమ్మవారు



పంపా సరోవరంలో కన్నుల పండువగా సత్యదేవుని తెప్పోత్సవం

అన్నవరం: నింగిలో చంద్రుని చల్లని కిరణాల్లో.. పాలకడలిని తలపించిన పంపా సరోవరంలో.. దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారితో కలసి.. రత్నగిరివాసుడు సత్యదేవుని హంస వాహన విహారం పరమానందకరంగా జరిగింది. క్షీరాబ్ది ద్వాదశి (కార్తిక శుద్ధ ద్వాదశి) పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి సుమారు రెండు గంటల పాటు ఈ ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను, క్షేత్రపాలకులు సీతారాములను రత్నగిరి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా పంపా తీరానికి తీసుకువచ్చారు. అక్కడ పూజా మండపంలో ప్రత్యేక సింహాసనంపై సత్యదేవుడు, అమ్మవారిని, పక్కనే మరో ఆసనంపై సీతారాములను ఉంచి పండితులు పూజలు చేశారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవార్లను మేళతాళాల నడుమ ఊరేగింపుగా పంపా నది ఒడ్డున సర్వాంగ సుందరంగా అలంకరించిన హంస వాహనం మీదకు వేంచేయించారు. తిరిగి పూజలు చేసి, హారతులిచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ హంస వాహనంలో స్వామి, అమ్మవార్లను పండితులు మూడుసార్లు నదిలో విహరింపజేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను, సీతారాములను దేవస్థానానికి తిరిగి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ వేడుకలను వేలాదిగా భక్తజనం తిలకించి, పులకించారు.

వశిష్ట గోదావరిలో లక్ష్మీనృసింహుని విహారం

సఖినేటిపల్లి: క్షీరాబ్ది ద్వాదశి పర్వదినం సందర్భంగా అంతర్వేది లక్ష్మీ నృసింహస్వామి వారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. పల్లిపాలెంలో స్థానిక అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం జరిగింది. తొలుత స్వామి, అమ్మవార్లను గరుడ పుష్పక వాహనంపై అర్చకులు కొలువుదీర్చారు. అనంతరం మంగళ వాయిద్యాల ఘోష నడుమ అంతర్వేది ఆలయం నుంచి పల్లిపాలెంలోని పుష్కర రేవు వరకూ అగ్నికుల క్షత్రియులతో కలిసి ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. అక్కడ ముందే సిద్ధం చేసిన పడవలపై గరుడ పుష్పక వాహనంలో స్వామి, అమ్మవార్లను ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు వేదమంత్రాలతో వేంచేయించారు. ప్రత్యేక పూజల అనంతరం బాణసంచా కాల్పుల నడుమ పుష్కర రేవు నుంచి గొంది సరిహద్దు వరకూ గోదావరి తరగలపై స్వామివారి తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను తిరిగి పుష్కర రేవుకు తీసుకుని వచ్చి, ఆలయానికి చేర్చారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ ఆర్.గోవిందరాజులు, ఎస్సై ఎస్.రాము, సర్పంచ్ ఒడుగు శ్రీను, ఎంపీటీసీ సభ్యులు బైర నాగరాజు, పోతాబత్తుల భాస్కరరావు, మాజీ సర్పంచ్ వనమాలి మూలాస్వామి తదితరులు పాల్గొన్నారు.



తెప్పపై కొలువుదీరిన అంతర్వేది లక్ష్మీనృసింహస్వామివారు

కన్నుల పండువగా వేంకటేశ్వరుని తెప్పోత్సవం



గౌతమీ గోదావరిపై సాగుతున్న స్వామివారి హంసవాహనం

ఆత్రేయపురం: క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారు శుక్రవారం సాయంత్రం ఉభయ దేవేరులతో కలిసి గౌతమీ గోదావరి జలాల్లో హంసవాహనంపై విహరించారు. ప్రత్యేకంగా అలంకరించిన హంసవాహనంపై స్వామి వారి తెప్పోత్సవం ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. ఉదయం తీర్థపు బిందెతో గోదావరి జలాలు తీసుకుని వచ్చి, సుప్రభాత సేవ అనంతరం, స్వామి వారికి అభిషేకాలు, గోత్ర నామాలతో పూజలు, నిత్య హోమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగింపుగా గౌతమీ గోదావరికి తీరానికి తీసుకుని వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తదితరులు పర్యవేక్షించారు. ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి, ఆత్రేయపురం శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాలను కూడా భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

ఇరిగేషన్ ఏఈఈ ఆత్మహత్య



మృతుడు అప్పల రాజారెడ్డి (పాత చిత్రం)

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీకి చెందిన వల్లింకల అప్పల రాజారెడ్డి (39) తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయం ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. సర్పవరం పోలీసుల కథనం ప్రకారం.. ఆర్టీసీ కాలనీ రోడ్డు నంబర్-1లో ఉంటున్న అప్పల రాజారెడ్డి గురువారం మధ్యాహ్నం తన గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకున్నాడు. మృతుడు ఆలమూరు మండలంలో ఇరిగేషన్ ఏఈఈగా పని చేస్తున్నాడు. భార్య సుధారాణి కాకినాడలో ఐసీఐసీఐ బ్యాంకులో అసిస్టెంట్ హోదాలో పని చేస్తున్నారు. వీరికి వివాహమై సుమారు 11 ఏళ్లు అవుతోంది. పిల్లలు లేకపోవడంతో సుమారు నాలుగేళ్ల పాపను దత్తత తీసుకుని, పెంచుకుంటున్నారు. అప్పల రాజారెడ్డి ఉరికి వేలాడటం చూసి, భయపడిన ఆ పాప ఏడవడాన్ని సమీపంలోనే ఉంటున్న అతడి తండ్రి సత్యనారాయణ అక్కడకు చేరుకున్నారు. పరిస్థితి గమనించి, బ్యాంక్‌లో విధుల్లో ఉన్న అప్పల రాజారెడ్డి భార్య సుధారాణికి సమాచారం అందించారు. అందరూ కలసి అప్పల రాజారెడ్డిని కిందకు దించి, సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకుని వెళ్లగా అప్పటికే అతడు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు సర్పవరం ఏఎస్సై నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు. కొడుకు మృతిపై తండ్రి అనుమానాలు వ్యక్తం చేయడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సెల్ ఫోన్ లాక్ ఓపెన్ అవలేదని, అది ఓపెన్ అయితే అప్పల రాజారెడ్డి మృతికి కారణాలు తెలిసే అవకాశం ఉంటుందని సీఐ మురళీకృష్ణ చెప్పారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.